క్లుప్తంగా

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

చిట్వేలి : మండలంలో పచ్చిరొట్టను సాగుచేసే రైతులకు 50శాతం సబ్సిడీతో ఆర్‌బీకేలలో అందుబాటులో ఉంచామని వ్యవసాయ అధికారి శ్రీకర్ తెలియజేశారు. 50శాతం సబ్సిడీ పోను జనుములు 10 కేజీల సంచి రూ.420లు, జీలుగలు 10 కేజీలు సంచి రూ. 395లు, 8 కేజీల పిల్లిపెసలు రూ.388 లు చొప్పున రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. సోమవారం నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు ముందుగా నగదు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ కె.రఘురాం

పుల్లంపేట : పుల్లంపేట ఎస్‌ఐగా కె.రఘురాం బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టి బదిలీపై పుల్లంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వాహనదారులు తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజంపేట రూరల్ : దేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీకి 32వ వర్ధంతిని పురస్కరించుకొని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూల భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి ఆయన కాంగ్రెస్ పార్టీకి, దేశానికి సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సి.సన్నీ, మని, శివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసులరెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి దీపా బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని రాయచోటి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని పారిశ్రామికవేత్త శ్రీనివాసుల రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, రెడ్డయ్య యాదవ్, అర్షద్, జాహీల్, మహమ్మద్ సుఫియాన్ సమీర్, అబుజార్, నవాజ్, మహమ్మద్ సుబహాన్, ఆసిఫ్, ఫిరోజ్, జబివుల్లా, షాబుద్దీన్, షారుక్ ఖాన్, ఉమర్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

సంబేపల్లె : స్థానిక పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను ఎస్‌ఐ షరీఫ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం స్టేషన్ ఇబ్బందితో కలిసి రికార్డులను పరిశీలించి, వాటి పురోగతిని పక్కగా నమోదు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందజేసే విధంగా రికార్డులు ఉంచుకోవాలన్నారు.

28 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ శిక్షణ తరగతులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు విశాఖ పట్నంలో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగతలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల కార్పొరేట్ విద్యా వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు విద్యార్థి లోకాన్ని పోరాటాలకు సన్నద్ధం చేసేందుకు రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి
- కుమ్మరపల్లెలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభించిన గడికోట


వృద్ధురాలికి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రామాపురం : రామరాజ్యంలా జగన్ పాలన సాగుతోందని వైఎస్‌ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామాపురం మండలం కుమ్మరపల్లె సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలపై ఆరా తీస్తూ ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ నిర్వహించిన కార్యక్రమానికి విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడున్నరేళ్లలో చరిత్రలో నిలిచిపోయేలా సరికొత్త సువర్ణ ఘట్టాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారన్నారు. అర్హతే ఆధారంగా ప్రజల చెంతకే సంక్షేమం, అభివృద్ధి పథకాలను అందిస్తున్నామన్నారు.

రైతు సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

రైతు సంక్షేమమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కుమ్మరపల్లె గ్రామ వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్ర నూతన భవన ప్రారంభంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ రైతు సంక్షేమానికి కృషి చేసి రైతు పక్షపాతిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. సీఎం జగన్ తండ్రి బాటలో పయనిస్తూ రైతుల సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తున్నారన్నారు. వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని, అవి రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రతి పంటనూ రైతులు ఈ క్రాపింగ్ చేయించుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరను కల్పిస్తుందన్నారు. కృష్ణా జలాలతో ప్రతి చెరువును నింపి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సస్యశ్యామలం చేయడమే తన ధ్యేయమన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, మాజీ సర్పంచులు రాంబసిరెడ్డి, అమరనాథరెడ్డి, రంగారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, చలమారెడ్డి, సర్పంచులు వెంకటరెడ్డి, రామాంజులు, ఆంజనేయులు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, నాయకులు జయరామిరెడ్డి, రాజారెడ్డి, గురుమూర్తి, సుబ్బరాయుడు, వెంకటరమణ, చంద్ర, సూరం వెంకటసుబ్బారెడ్డి, రామురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలకు

రాయచోటి టౌన్ : కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాలిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 241 ర్యాంక్, జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన వేదశ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌బీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు సుధాకర్, కొలిమి చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

రాయచోటి అర్బన్ : ఈదురు గాలుల వలన వెలిగల్లు తాగునీటి పథకం ద్వారా రాయచోటి పట్టణానికి అందించే తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగిందని మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వీచిన బలమైన ఈదురుగాలులతో కూడి వర్షం కారణంగా వాటర్ స్కీం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంబాలు దెబ్బతిన్నాయన్నారు. వీటికి మరమ్మతులు చేపట్టి.. నీటి సరఫరాను పునరుద్ధరించేందుకు 24 గంటల సమయం పడుతుందన్నారు. పట్టణ వాసులు పరిస్థితిని అర్థం చేసుకుని తమకు సహకరించాలంటూ కోరారు.

భక్తిశ్రద్ధలతో నషాన్

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలోని చాంద్‌ఫిరా గుంబద్ దర్గా ఉరుసు నషాన్ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లీ అమీరు న్నీసా తమ ఇంటి నుంచి ఫకీర్ల మేళతాళాల సందడి మధ్య దర్గా వద్దకు గంధం కలశాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. గురువుల మజార్ వద్ద గంధాన్ని సమర్పించి ఫాతెహా చేశారు. దర్గా ఆవరణలో జెండా ప్రదేశంలో నషాన్ ఉత్సవం నిర్వహించి జెండాను అలంకరించారు. హాజరైనభక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పట్టా రైతులకు ఇబ్బందులు కలిగించవద్దు


ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించుకుంటున్న రైతులు

రాజంపేట టౌన్ : పట్టాభూములున్న రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని ఊటుకూరు అరుంధతివాడ, దళితవాడ, కొండ్లోపల్లె దళితవాడ, అరుంధతివాడ, వడ్డిపల్లెకు చెందిన రైతులు ఆదివారం తమ సమస్యను ఎమ్మెల్యేకు తెలియజేశారు. తమ పట్టా భూములను సాగు చేసుకుంటుండగా రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి సంబంధిత వీఆర్‌ఓను పిలిపించి రైతులకు ఇబ్బందులు పెట్టవద్దని ఆదేశించారు. ఎవరైనా రైతుల భూములు ఆక్రమిస్తే కాపాడాల్సింది పోయి రైతులను ఇబ్బందులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఇకపై రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్, తహసీల్దార్‌ల దృష్టికి తీసుకెళ్లి మరోమారు సమస్య తలెత్తనివ్వకుండా చర్యలు తీసుకుంటానని రైతులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఇదిలావుంటే కొండ్లోపల్లె, ఊటుకూరు దళితవాడ, వడ్డిపల్లె ప్రజలు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. శ్మశాన వాటికకు స్థలాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే వీఆర్‌ఓను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పృథ్వీరెడ్డి, ఎంపీటీసీ నాగశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రేవరాజు శ్రీనివాసులురాజు, నాగేశ్వరరావు, రాజేష్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, మాధవరాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పీఆర్సీ కమిటీ వేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐదేళ్లు పూర్తి కావస్తున్నందున కొత్త పీఆర్సీకి కమిటీ వేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాసుబ్బయ్య, సీవీ ప్రసాద్, అలీఖాన్, చెంగల్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2023 జూన్ 30 నాటికి పీఆర్సీ గడువు ముగుస్తుందని, జులై 1, 2023 నుంచి కొత్త పీఆర్సీ గడువు ప్రారంభమవుతుందన్నారు. అలాగే పీఆర్సీ ఆలస్య కాలానికి ఇచ్చే మధ్యంతర భృతి కూడా జులై నుంచి ప్రకటించాలని కోరారు.

నాటుసారా బట్టీలపై ఎస్ఈబీ దాడులు

మదనపల్లె : మదనపల్లె మండలం సీటీఎం గ్రామానికి సమీపంలోని చెరువుకట్ట కింద దట్టమైన ముళ్ల పొదల్లో అక్రమంగా నాటుసారా తయారీ జరుగుతోందన్న సమాచారం మేరకు ఆదివారం ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. బెల్లపుఊట, సారా తయారీకి వినియోగించే సామగ్రి, ఊట నిల్వ చేసిన డ్రమ్ములను గుర్తించారు. దీంతో అక్కడికక్కడే ఎస్ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సుమారు 800 లీటర్ల బెల్లంఊటతో పాటుగా ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీదారుడుగా పాలెంకొండకు చెందిన గల్లా రవికుమార్(40)ను గుర్తించి కేసు నమోదు చేశారు. దాడుల్లో బీఎంపీపీ ఎస్‌ఐ సి.రాజశేఖర్, సిబ్బంది దామోదర్, ప్రసన్నకుమార్, రూప్‌కుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

వాల్మీకిపురం : మైనార్టీల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని అటవీ, విద్యుత్, భూగర్భవనరుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురం పట్టణంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్ కలీమ్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన నేపథ్యంలో ఆదివారం సదుంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వం ఉర్దూను రెండో అధికార భాషగా అమలు చేస్తోందని, ఉర్దూ సాహిత్యం, భాషాభివృద్ధికి ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అటు పాలనలోనూ, ఇటు సంక్షేమ పథకాల అమలులోనూ మైనార్టీలకు ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీలు సీఎం జగన్మోహన్ రెడ్డికి అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, మాజీ సర్పంచ్ హుమయూన్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

రామసముద్రం : మండలంలోని మినికి గ్రామంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటరమణస్వామి ఉత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీదేవి , భూదేవి సమేత వెంకటరమణస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, కలిశారాధాన, బలిహరణ, మహా మంగళహారతి పట్టారు. రాత్రి కల్యాణోత్సవం నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణ తంతును తిలకించారు.

హెచ్‌ఐవీపై సమాజాన్ని చైతన్యపరుద్దాం


రాజంపేట రూరల్: కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న వైద్య సిబ్బంది


లక్కిరెడ్డిపల్లె: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె : అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆదివారం చేపట్టిన కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్, వైద్య సిబ్బంది అడపాల సునీల్ సీఎల్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై సమాజాన్ని చైతన్య పరిచేందుకు కొవ్వొత్తులు చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ షఫీ నాయక్, ఉపాధ్యాయులు సురేష్, రఘురాం, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : హెచ్‌ఐవీకి గురై మృతి చెందిన వ్యాధిగ్రస్తులకు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల సంస్మరణ దినంలో భాగంగా ఏరియా ఆసుపత్రి వద్ద కొవ్వొత్తులు వెలిగించి హెచ్‌ఐవీతో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవరెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, ఎల్‌టీ, వీహెచ్ఎస్, టీఐఎన్‌జీఓ వైఆర్‌జీ కేర్ సంస్థలలో పని చేసే సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు, గ్రామస్తులు

సిద్దవటం : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. సిద్దవటంలోని దిగువపేట, కమ్మపాలెం, అటవీ చెక్‌పోస్టు ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు ఆదివారం లైఫ్ ప్రోగ్రాంను, ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు మాట్లాడుతూ విద్యుత్‌ను పొందుపు చేయడం, ప్లాస్టిక్‌కు స్వస్తి పలకడం, మొక్కలు నాటడం, నీటి వృథాను అరికట్టడంపై విద్యార్థులు, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా కట్టడి, అటవీ జంతువులను పరిరక్షణపై అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ రాజశేఖర్‌రెడ్డి, ఏబీఓలు, ప్రొడక్షన్ వాచ్చర్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, గ్రామస్తులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు విజ్ఞానం


సిద్దవటం: గ్రంథాలయంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు, చిన్నారులు


చిట్వేలి: గ్రంథాలయ వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దవటం : గ్రంథాలయాలతో విద్యార్థులు సంపూర్ణ విజ్ఞానాన్ని పొందుతారని సిద్దవటం గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరానికి ఆదివారం 25 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులతో ధ్యానం, పుస్తక పఠనం, పద్యాలు చెప్పించి అనంతరం చదరంగం, క్యారం బోర్డు ఆడించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీహరి సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : చిట్వేలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. గ్రంథాలయంలో ఆదివారం జరిగిన వేసవి శిబిరంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో కథలు చదివించడం, నేర్పించినట్టు గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు తెలిపారు. అలాగే చెస్, డ్రాయింగ్‌లు ఆడించినట్లు ఆయన తెలియజేశారు.

పట్టుదలతోనే విద్యావేత్తలుగా ఎదుగుతారు

కడప రూరల్ : క్రమశిక్షణ, పట్టుదలతోనే విద్యావేత్తలుగా ఎదుగుతారని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి బ్రహ్మయ్య అన్నారు. ఏపీ రాష్ట్ర నూర్‌బాష్ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరు చిన్న రాజా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక దూదేకుల భవన్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 60 మంది దూదేకుల విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులకు పట్టుదల, అంకితభావం ఉండాలన్నారు.

వైభవంగా అమ్మవారి జాతరలు


రాజంపేట రూరల్: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి


పెనగలూరు: పురవీధులలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : గంగమ్మ జాతరను మండల పరిధిలోని తాళ్లపాక, శవనవారిపల్లి పంచాయతీలోని గొల్లవారిపల్లె దళితవాడలలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. జాతరను సందర్భంగా తాళ్లపాక, శవనవారిపల్లి పరిసర ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి రాజంపేట మండలంతోపాటు సమీప మండలాల ప్రజలు తరలివచ్చారు. పొంగళ్లు పొంగించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ప్రత్యేక పూజలు

గంగమ్మ జాతరకు వచ్చిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలను కబడ్డీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేడా మధుసూదన్‌రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, దండు గోపీ, దాసరి పెంచలయ్య, ఎం.శ్రీనివాసులుగౌడ్, రమణారెడ్డి, జయరామ్‌నాయుడుతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నడిమి సిద్దవరంలో..

పెనగలూరు : మండలంలోని నడిమి సిద్దవరంలో ఎల్లమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి నుంచి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నడిమి సిద్దవరంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. సిద్దవరం సర్పంచ్ రాఘవరెడ్డి ప్రేమలతరెడ్డి, వెంకటేష్‌రెడ్డి దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం పొంగళ్లు పెట్టుకొని మొక్కులను తీర్చుకున్నారు. ఎల్లమ్మతల్లిని గ్రామ పురవీధులలో మేళతాళాలు మధ్య ఊరేగించారు.

ఆమాట అనడానికి నోరెలా వచ్చింది బాబు!


మాట్లాడుతున్న దండు గోపి

రాజంపేట టౌన్ : అమరావతిలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు ఇవ్వనున్న ఇళ్ల స్థలాలను చంద్రబాబునాయుడు సమాధులతో పోల్చడాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి తప్పుబట్టారు. పేదల నివాసం కోసం ఇచ్చే స్థలాలను సమాధులు అనేందుకు చంద్రబాబుకు నోరెలా వచ్చిందన్నారు. స్థానిక తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబునాయుడుకు మొదటి నుంచి పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అంటే అస్సలు గిట్టదని ఆరోపించారు. సీఎం జగన్ అమరావతిలో శాసన రాజధానిని ఏర్పాటు చేయనున్నారని, ఆ ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వనుండటంతో బాబు జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. గతంలో ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా అని ఎస్సీల పట్ల బాబుకు ఉన్న వ్యతిరేకతను బహిరంగంగానే వ్యక్తపరిచారని గుర్తు చేశారు. అలాగే బాబు సీఎంగా ఉన్నప్పుడు నాయీబ్రాహ్మణులను తోక కత్తిరిస్తానని హెచ్చరించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు? ఇప్పటికైనా చంద్రబాబునాయుడు పేదలు, బీసీలు, దళితుల పట్ల వ్యతిరేక భావనను వీడాలని దండు గోపి హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దళిత విభాగం నాయకులు బొజ్జా పెంచలయ్య, నరేష్, నరేంద్రబాబు, శంకర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాలల యోగా శిబిరం ముగింపు

కడప కల్చరల్ : వేసవి సందర్భంగా స్థానిక పటేల్‌రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 21 రోజులపాటు నిర్వహించిన బాలల యోగా శిక్షణాశిబిరం ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి భీతిహరానంద మాట్లాడుతూ చిన్న పిల్లల్లో శారీరక, మానసిక ధృడత్వానికి, ఏకాగ్రత పెరగడానికి, నైతిక విలువలు అలవడడానికి యోగా సాధన ఉత్తమ మార్గమన్నారు. దైనందిన జీవితంలో ఆహారపు అలవాట్లకు కూడా ప్రాధాన్యత ఉందని, తాజాగా ఇంటిలో వండిన ఆహారానికే ప్రాముఖ్యత ఇవ్వాలని, పిజ్జాల, బర్గర్‌ల సంస్కృతికి దూరంగా ఉంటేనే రోగాలు దరిచేరవన్నారు. యోగాసనాల సాధన వల్ల శారీరక దారుఢ్యంతోపాటు మానసికంగా ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కొనే సామర్థ్యం పిల్లలలో ఏర్పడగలదన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య, క్రీడాశాస్త్ర సంచాలకులు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులను తల్లిదండ్రులు యోగా సాధన వైపు ప్రోత్సహించాలని, విద్యార్థుల రోజువారి జీవితాలలో యోగా సాధన ఒక భాగం కావాలని, అప్పుడే పిల్లలు శక్తివంతమైన, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు.

ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు


లక్కిరెడ్డిపల్లె: పూజలందుకుంటున్న గంగమ్మ


సంబేపల్లె: నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చిన్నమండెం : మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

గంగమ్మను దర్శించుకున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ ఆలయానికి ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. భక్తులకు క్యూ లైన్‌లో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పిస్తూ తీర్థప్రసాదాలను అందజేశారు.


చిన్నమండెం: దర్శనమిస్తున్న మల్లూరమ్మ